ఎంత ప్రయత్నించినా అమెరికన్లు మమ్మల్ని రెండో తరగతి పౌరులుగానే చూస్తున్నారు. పైగా , దక్షిణాఫ్రికా, బ్రిటన్‌ల్లో వాళ్ళు మమ్మల్ని ఎప్పటికైనా తరిమేస్తారేమోననే భయం కూడా మాకుంది. భారతదశం వచ్చేయాలనుంది. కానీ రాలేము. చుట్టపు చూపుగా ఇండియా ఎప్పుడైనా రాగలిగితే వస్తామేమో! అదయినా దగ్గర్లో మాత్రం కాదు. మీ ఆరోగ్యం బాగున్నట్టు రాయగలరు...''

ఈ ఉత్తరం అందిన వారానికి పక్షవాతం తిరగబెట్టి క్షోభించి క్షోభించి 'హరీ' మన్నాడు వారణాసి రావు. ఈ వార్త విన్నాడు సూర్యారావు. హైద్రాబాద్‌లో సొంతంగా ఎలక్ట్రానిక్స్ చిప్స్ ఫాక్టరీనే పెట్టి కొన్ని వందలమందికి తిండి ప్రాప్తి కలిగించిన తన కొడుకు దగ్గర ఉన్నవాడల్లా, ఉన్నవాడు ఉన్నట్టుగా తన భార్యా, కొడుకు, కోడలూ వాళ్లపిల్లల్తో సహా వచ్చి వాలాడు. కర్మంతా సవ్యంగా జరిపించాడు. విధవ చెల్లెల్తో (వరస చెల్లెలు) తిరుగు ప్రయణమవుతూ కొడుకుతో అన్నాడు. ''ఈ క్విట్ ఇండియా ఉద్యమం ఆగితేనే గాని మనదేశం బాగుపడదురా. మీ ఇంజనీర్స్ అసోసియేషన్‌లో మూవ్‌చేసి దీని ఆపేందుకు పథకాలాలోచించరా నాన్నా!'' అని.

(కృష్ణా పత్రిక 1984)

*** *** ***

# భారత మహిళా, మళ్ళీ జోహార్!

ఏలూరెళ్ళటానికి నేను రాజమండ్రిలో మెడ్రాస్ మెయిలెక్కాను. జనరల్ కోచ్ ఎక్కాను. నా చిన్నప్పట్నుంచీ ఉన్నట్టుగానే అప్పుడు కూడా పెట్టె జనంతో కిటకిటలాడిపోతోంది. ఆ తోపులాటలో ఎక్కువదూరం వెళ్లలేక నేను తలుపు పక్కనున్న ఫోర్ సీటర్ల మధ్య కెళ్ళి నుంచుండిపోయాను. ప్లాట్‌ఫారం వైపు చూస్తూ నుంచున్నాను. నాకెడం పక్క ఫోర్ సీటర్‌కి పైనున్న అటకమీద తెల్లజాతి యువకుడొకడు పడుకొని ఏదో నవల చదువుకొంటున్నాడు. దాని కెదురు అటకమీద అదే జాతి యువతి ఒకత్తె జీన్సూ చొక్కాల్లో కూర్చొనుంది. ఒళ్ళో ఉన్న ఊలు ఉండతో చిన్న స్వెట్టర్ అల్లుతూ, నోట్లో ఉన్న సిగరెట్‌తో దమ్ము పీలుస్తూ మధ్య మధ్య ఆ యువకుడితో ఆమె ఇంగ్లీషులో ఏదో మాట్లాడుతోంది. వాళ్లిద్దరి సంభాషణలో అక్కడక్కడ నాకర్థమైన 'త్రో డౌన్ ఫ్రమ్ ది గోల్డెన్ గేట్ బ్రిడ్జ్', 'దీజ్ నేటివ్ బగ్గర్స్' ... వగైరా మాటలను బట్టి వాళ్ళు అమెరికన్లని గ్రహించాను. అయితే భార్యా భర్తల్లో, లేకపోతే కలిసి బతికే రకం ఫ్రెండ్సో అయ్యుంటారని కూడా అనుకున్నాను. బహుశా , మద్రాసులో విమానం ఎక్కడ కోసం ఆదరాబాదరా ఈ పెట్టెలోకి వాళ్ళెక్కారేమోనని కూడా నాకనిపించింది. ఇంతలో ప్లాట్‌ఫారం మీదకి అరటిపళ్ల బండొచ్చింది. ఆరు రూపాయలిచ్చి పాతిక అరటిపళ్ళు కొన్నారు వాళ్లు. వాళ్ళని చూసి చూసి ఇక సభ్యత కాదనుకొని, తలొంచుకొని ఏదో ఆలోచించుకుంటూ నుంచుండిపోయాన్నేను.

రెండు నిముషాలు గడిచాయె లేదో నా కుడివైపు ఫోర్ సీటర్లొంచి , అంటే ఆ అమెరికన్ స్త్రీ కి కిందగా కూర్చొనున్న మగాళ్ళలోంచి కలకలం బయల్దేరింది. ఒక యువకుడు అంటున్నాడు-'' ఏటిది, యీ యమ్మకి మతిగాని మాసిపోనాదేటి? అరిటిపండు తొక్కని బుర్రమీద కొగ్గేస్తాంది. కింద కూసున్నోల్లు మణుసులనుకున్నాదా, మేకలనుకున్నాదా?''

అతను శ్రీకాకుళం ప్రాంతపు యువకుడని నా కర్థమయింది ఆ అమెరికన్ స్త్రీ తను తిన్న అరటిపండు తొక్కని కిందికి పడేసింది అది అతని తలమీద పడింది- అని నేను గ్రహించాను. ఆమెవైపు పరిబులునగా చూశాను మళ్లీ ఆమె నా వైపు చూసి, పొగరుగా తలెగరేసి, సిగరెట్టు పొగ పైకివదిలింది. అరటిపండు నోట్లో పెట్టుకుంది కిందున్న యువకుడి పక్కనున్న వృద్ధుడు అన్నాడు- " తొలుత ఆయమ్మకి సెప్పినాంగదా, ఎన్నిమాట్లు సెప్పుతము అల్లెవురో యెరికా- దొరలు. అల్లకేటయిన మాట జారిసమంటే లావు జగడమయిపోతది. పోలీసోల్లొచ్చి మన కట్టికెడతరు ఉఁయ్యంయ్యో మని బొక్కల తోసేత్తరు. వల్లకుండెహె!"

నాకెడంవైపు ఫోర్సీటర్ మీద కూర్చునున్న వాళ్ళు ఆడవాళ్లు వాళ్ళలో ముగ్గురు వృద్ధులూ, ఒక యువతీ, ఇంకొక చిన్నపిల్లాను. వీళ్ళూ ఆ మగవాళ్లూ అంతా ఒకే కుటుంబంలో వాళ్లని నా కిందాకట్నించీ అర్థమవుతూనే ఉంది ఆ యువతి ముందుకొంగి వృద్ధుడితో అంది -" దొరలైతే ఏటి? బుర్రలికి తీసిస్తరా? ఆయమ్మకి బుర్రమీద అరటితొక్క ఒగ్గేసిన మంటే ఒల్లకుంటదా? మరి మన మెందుకు వల్లకుంటము? అసలికి యీ గుంటగ్గాని మంచీ సెబ్బరలేదేటి? యెఁయెఁ!"

వృద్ధుడన్నాడు, "వల్లకుండె అప్పలకొండా అల్లతో మనకేటి? సందేలకి బెజాడెల్లిపోయొచ్చిన మంటె తిరపతి బండెక్కుతము. యీల్ల వూసుకి ఒగ్గెయ్యి. యినుకో. ఎంకన్న బాబుని తలుసుకో. అన్నీ అతనే కాసుకుంటడు."

ఆ యువతి - అప్పల కొండ - కోపంగా వృద్ధుడి వంక చూసింది. ఎదురుగా పైనున్న అమెరికన్ యువతిని చూసింది మార్చి మార్చి కోపంగా చూసింది చివరికి, తన పక్కనున్న ముసలమ్మల్తో -తల్లీ, అత్తగారు అనుకుంటాను - లోగొంతుకతో మాటల్లో పడిపోయింది. మధ్యమధ్య నా వైపు బెరుగ్గా చూస్తోంది. ఆ మాటకొస్తే ఇందాకట్నుంచి వాళ్లంతా నావైపు బెరుగ్గానే చూస్తున్నారు. దానిక్కారణం నా ఉనికి తీరు.

నేను ప్రభుత్వోద్యోగిని గెజిటెడ్ హోదా కలవాణ్ణి నా హోదాకి తగినట్టుగా సూటూ బూటుల్తో నేను కనిపిస్తూండటం వల్లనే అనుకుంటాను ఆ ముగ్గురూ నావైపు ఏదో చెప్పాలని చూస్తూ కూడా వెనక్కి తగ్గుతున్నారు. నేను మేధావి వర్గంలో వాణ్ణి. లోకంలో నాలాంటి ఉన్నతులు ఎట్లా ఉంటున్నారో, ఇట్లాంటి సందర్భాల్లో తమ కేమీ పట్టనట్టు ఉండటమే నాగరికత అని ఎట్లా అనుకుంటుంటారో నాకు తెలియంది కాదు. నేనూ ఇప్పుడిట్లాగే 'నా కెందుకులే' అని ఊరుకోవచ్చు కానీ ఊరుకోబుద్ధి కాలేదు. బహుశా కృష్ణా, గోదావరి జలాలు ఉగ్గుపాలతో రంగరించి నాకు పోసిన 'ఒకే తల్లి బిడ్డలం భావన' కారణం కావచ్చు. అప్పలకొండతో నేనన్నాను- " అసలేంటీ విషయం? మీకూ ఆ అమ్మాయికీ దెబ్బలాటెందుకొచ్చింది?"

చటుక్కున ఉత్సాహంగా, సానునయంగా అందుకొంది అప్పలకొండ- " మాము యిజయనగరంల ఎక్కినము బాబూ యీ తెల్లగుంటలిద్దరూ యిసాకపట్నంల ఎక్కినరు. అల్లతో మాము మాటలాన్నే నేదు. అసలికేటి బాబూ మాకు అల్ల వూసు? ఎక్కినేల్నించి అల్లు మా తట్టుకు నూసి అల్ల బాసల 'ఆస్పీస్ ఆస్పీస్' అనుకుంటా వూసులాడుకున్నరు. సేతుల్తో మాకు సూపిచ్చుకొని నవ్వుకున్నరు. మాఁవు అల్ల సూపుకి సీమల్నాగా, దోమల్నాగా కానుకున్నామో యేటొ? మాకు సూసి సూసి యికటాలే యికటాలు ' ఓలమ్మి యిల్లిట్టాగ పగలబడిపోతన్నరూ యీల్లే దేశఁవు వోల్లూ' అనుకున్నామే గాని ,

యీల్లాంటి ముదనష్టపు యెదవలని యెరికనేదు బాబూ యిహ యెక్కినేల్నించి తినటఁవే తినటఁవు యిప్పటేలకి వొంద రూపాయల తిండి తినీసినరు తొలేత గుడ్డట్లు తినీసి ఆ కాయితం మామాఁవ మీది కిసిరీసినాది అల్ల ఆ గుంట. బండి పారెల్లి పోయెచ్చినాక నా బుర్రమీద ఆపిల్సుకాయ తొక్కలేసినాడు యిల్లిదిగో యీ గుంట. బిసికెట్టు ముక్కలు, జీడిపప్పు కాయితాలు , అల్ల శార్దఁవూ అన్నీ యిసర్టఁవే ! యిహ సిగరెట్లా , అయ్యి సిగిరెట్లగావు, మా కాకివాలస వూర్ల శివులోరి తిరణాల కాగడాలు రైలింజన్నాగ గుప్పుగుప్పు గుప్పుగుప్పు పొగ ఒదల్డమే వొదల్డఁవూ... ఆ బూది, ఆ పీకిలు కిందికొగ్గేయటమే ఒగ్గేయటఁవూ.. ఎన్ని సుట్లో ! తుని స్టేసన్ల మామాఁవ లేసి నుంచోని యిది మంచిపని గాదమ్మా అని సెప్పినడు. అయితే ఆ గుంటకి లెక్కేటి? అల్ల బాసల బుసబుసలాడేసుకున్నరు. ఆయమ్మ మల్లీ మల్లీ బూది కిందికి ఒగ్గేస్తనే వున్నది... నా కెరికనేకడూతన్నాను, మాఁవు శ్రీకాకులం వొల్లంగ, దాని సూపులికి గొడ్లునాగ అన్తన్నామేటి బాబూ?''

అప్పలకొండలో ఉన్న పౌరుషానికీ, ఆత్మాభిమానానికీ ఆనందంతో నాగుండె ఉప్పొంగిపోయింది. ఒక్క గోదావరీ ప్రాంతంలోనే కాదు, నాగావళి, కావేరి, యమున , బ్రహ్మపుత్ర, గంగ, సింధు ప్రాంతాల్లోని- ఆ మాటకొస్తే భారతదేశంలోని- ప్రతి అంగుళంలోనూ ఈ పౌరుషమూ, ఆత్మాభిమానమూ ఉప్పొంగుతూంటాయనే విషయం నాకు తెలుసు. ఇప్పుడు మరొకసారి రుజువవుతున్నదంతే!

' శ్రీకాకులం వోల్లం గొడ్లునాగ అన్తన్నావేటి బాబూ! ' అన్న అప్పలకొండ మాటకి నాకు చురుక్కుమంది. నా గుండెల్లోకి ముల్లు కసిక్కిన దిగినట్టయింది. నా మనస్సు విలవిల్లాడిపోయింది. నాలుగైదు క్షణాల తరువాత తేరుకున్నాను. అన్నాను - '' తప్పు తప్పు శ్రీకాకుళం వాళ్లు చాలా గొప్పవాళ్ళు బెజవాడ, మద్రాసు, ఢిల్లీల్లో ఉండేవాళ్లు ఎంత గొప్పవాళ్లో మీరూ అంత గొప్పవాళ్లు. ఎటొచ్చీ ఈ తెల్లవాళ్ళకే మన గొప్పదనం ఏంటో తెలియదు. వాళ్లింకా మనమీద రాజులమనీ, మనం వాళ్లకింద బానిసలమనీ అనుకొంటున్నారు. అందులోను ఈ గుంట లిద్దరూ మరీ సన్నాసిరకం . అందుకనే అట్లా ప్రవర్తిస్తున్నారు. ఈసారి మళ్ళీ ఏదన్నా జరిగితే నువ్వేం భయపడకు. నీపక్కన నేనున్నాను అవసరమైతే అదుగో ఆ ఆఫీసరు బాబుల్ని కూడా పిలుస్తాను ''. ఇట్లా అంటూ నేను నా పక్కన వరండా పొడుగ్గా నిలబడున్న జనాన్ని చూపించాను. అప్పలకొండ మొహం ఒక్కసారిగా వెయ్యి వాట్ల బల్బులాగా వెలిగిపోయింది. ఆ వెలుగును, ఆ మెరుపును నేనెన్నటికీ మరిచిపోలేను. అమెరికన్ అమ్మాయి 'మార్ల్‌బరో' పాకెట్టు తీసి మళ్ళీ కొత్త సిగరెట్టు వెలిగించింది. రెండు, మూడు దమ్ములు పీల్చి పైకి పొగ వదిలింది. హటాత్తుగా ముక్కునించీ కళ్ళనించీ కారటం మొదలుపెట్టిన స్రావాల్ని రుమాలుతో తుడుచుకొంది. తను అనుకొని కూర్చొనున్న పార్టిషన్ జల్లెడ కన్నంలోంచి అవతలివైపు అటకమీదికి నిశ్శబ్దంగా ఉమ్మేసింది. ఆ ఉమ్మును అవతల పక్క ఎవరు భరించారో తెలీదు. రెండు, మూడు క్షణాల తరువాత చెయ్యి కిందికి చాపి సిగరెట్టు నుసి దులిపింది అది సరిగ్గా అప్పలకొండ భుజంమీద పడింది. అంతే. నా కొళ్ళు మండిపోయింది. అప్పలకొండ కూడా చటుక్కున నుంచుంది. నేను చటుక్కున ముందుకు రెండడుగులేశాను. ఆ యువతి వైపు వేలు చూపిస్తూ తీవ్రంగా '' యూ- కీపిట్ ఇన్ యువర్ పాకెట్.'' అన్నాను ఆమె మళ్లీ సిగరెట్ నుసి కింద దులపబోయింది. చటుక్కున నావేలితో ఆ సిగరెట్టును ఎగరగొట్టాను అది ఎగిరి కింద పడింది ఇటు పక్కనుంచి అమెరికన్ యువకుడు నా భుజం పట్టుకుని ఒక్క తిప్పు తిప్పాడు నేను తిరిగి చూశాను అతను చెయ్యెత్తి నా నెత్తిన కొట్టబోయాడు అంతే! నా ముందున్న అప్పలకొండ తన

అరచేతిని వాలుగా తిప్పి దాంతో ఆ యువకుడి మోచేతి మడతమీద విస్సిరి ఒక్క దెబ్బ కొట్టింది అతను చటుక్కున చెయ్యి వెనక్కి లాగేసుకున్నాడు

ఆ సంఘటనకి ఆ ఇద్దరే కాక మేమంతా కూడా అవాక్కయిపోయాం బక్కచిక్కి ఉన్న అప్పలకొండ అరచేతిలో ఫిరంగి గొట్టంలా ఉన్న చేతిని కొట్టేటంత బలమా? అప్పలకొండ చటుక్కన నేలమీద పడున్న అరటి తొక్కలు, సిగరెట్టు ముక్కలూ చకచకా ఏరి, గుప్పెటితో తీసి, ఆ యువకుడి మొహాన విసిరి కొట్టింది. ఇక తిట్లు మొదలెట్టింది- "ఆ బాబు క్కొడతావేట్రా, దొంగసచ్చినెదవా! నీ బుర్రగ్గొరిగియ్య! నీకు పాతియ్య నీ సేతులిరిగిపోను. పబ్లిగ్గా సిగిరెట్లు కాల్చే తుప్పతలయెదవలు. సిగ్గూ సెరవూఁలేని కొజ్జా యెదవులు. తొక్కలికి బుర్రమీది కోగ్గేస్తారు. బూది ఒగ్గేస్తారు. మీ మొగాలికి పామీసుకోరాదేట్రా శ్రీదేవి నాగుంటరు. అసలికి కిందికి దిగండ్రా మీ పని సెబుతను. దుమ్ము లేరేసీగల్లు ఏటనుకుంతన్నరో! వో అత్తమ్మో లెగవ్వేటే , వోరప్పుడు మాఁవ లేసి మాటాడవేట్రా, మొగోడివి కాదేట్రా లెయ్యే..."

ఆ భర్తా వృద్ధుడూ కూడా లేచారు. చటుక్కున వాళ్ళుకూడా తిట్లందుకున్నారు. ఈ కేకలికి మా చుట్టుపక్కల జనమంతా మా దగ్గరికి పోగయ్యారు. అప్పలకొండ ఎగిరెగిరిపడుతూ చేత్తో ఆ ఇద్దర్నీ మొహాలమీద పొడిచి పొడిచి తిడుతోంది. అప్పటికే ఆపై వాళ్లిద్దరూ బెదిరిపోయారు! బిక్కచచ్చిపోయి చెరోక మూలకీ ముడుచుక్కూర్చున్నారు. అంత తలబిరుసు మనుషులూ కూడా నిమిషంలో గాలి తీసేసిన బంతులయిపోయారు

ఇంకో నాలుగైదు నిముషాలు వాళ్లని తిట్టనిచ్చి అప్పుడెట్లాగో శాంతపరచి వాళ్ళని కూర్చోబెట్టాన్నేను. అప్పటికి బండి నిడదవోలు దాటింది. ఇహ ఆ తరువాత పైనించి నుసీ పడలేదు. తొక్కలూ పడలేదు. తాడేపల్లిగూడెంలో బండి ఆగింది. నావైపు కృతజ్ఞతగా చూస్తూ అప్పలకొండ కుటుంబం అంతా బండి దిగిపోయింది. అప్పల కొండ మాత్రం ఒక గమ్మత్తయిన పని చేసింది.

ఖాళీ సీటర్లోకి నేను సర్దుకోగానే సీజను టిక్కెట్టు ఉద్యోగస్తులు కొంతమంది కొత్తగా తోసుకుంటూ ఎక్కొచ్చి నాపక్కన కూర్చున్నారు. వాళ్ల కోసం పక్కకి ఒత్తిగిల్లిన అప్పలకొండ, వాళ్లుకూర్చోగానే వాళ్లతో ఆవేశంగా అంది- " బాబూ అల్ల ఆ తుప్పతల్లం...ని సూసినారు? సిగిరెట్టు పీల్చి మీమీది కూస్తది! బూదేస్తది. మామీది కేసినాదిలే. యీ బాబూఁ, మాఁవూ సల్లగ బుద్ది సెప్పినము. మీరు గాని వల్ల కున్నరంటే మీ బుర్రలకి నీరుడే పోస్తది. ఏటి సేస్తరోటో జాగరత!" ఇట్లా అంటూ కసిగా ఆ యువతివైపు మెటికలు విరిచి, నావైపు చూసి " యెల్లిపోయొస్తము బాబూ!" అంటూ హడావిడిగా బండి దిగెళ్ళిపోయింది.

ఉవ్వెత్తుగా నాలో ఆలోచనలు లేచాయి. భారతదేశంలోని సామాన్యప్రజ నిద్రిస్తున్న ఒక మహాశక్తి. మేధావుల కర్తవ్యం- ఆ శక్తిని మేల్కొలిపి అన్యాయాలను ఎదుర్కొనే పట్ల దానికి ఆసరాగా నిలబడటమే. చాలు, కాగల కార్యాన్ని అది కానిచ్చేస్తుంది. అంతేగాని, నిద్రిస్తున్నది గదాని దాన్ని ఈసడించుకుంటూ, దాన్నించి దూరంగా పారిపోవటం కాదు. పూర్వం ఇట్లాంటి సంఘటనే ఒకటి జరిగితే, ఆ కథలోని సామాన్య స్త్రీని చూసి 'భారత మహిళా జోహార్ ' అని మెచ్చుకున్నాన్నేను. ఇప్పుడు అప్పలకొండని చూసి ఏమనాలి- 'భారత మహిళా మళ్లీ జోహార్ !' అని కదూ?

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 17-8-88)

★★★ ★★★ ★★★